క్లుప్తంగా

కస్తూరిబా పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

భీమారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను గురువారం తనిఖీ బృందం సభ్యులు రాజవర్ధన్, నరేందర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులు, కూరగాయలు ఇతర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఫలాలు పిల్లలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది పరిశీలించినట్లు తెలిపారు. అధికారులు ఐలయ్య, నీలావతి, ప్రిన్సిపాల్ కనకలక్ష్మి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని వ్యూ పాయింట్ వద్ద మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య 84వ వర్ధంతిని గురువారం తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గం నుంచి లక్ష్మయ్య ఎమ్మెల్యేగా ఎన్నికై బీసీలను చైతన్యపర్చారని తెలిపారు. బీసీ నాయకులు చుంచు రాజ్‌కిరణ్, నీలి శ్రీనివాస్, తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏదునూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారి చల్ల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి సూరన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్రపర్యటన



గాంధారి ఖిల్లాను సందర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటన చేశారు. డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారి ఖిల్లాను సందర్శించారు. అక్కడి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక విశేషాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు గాంధారి మైసమ్మను విద్యార్థులు, అధ్యాపకులు దర్శించుకుని పూజలు చేశారు. చారిత్రక విశేషాలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు రేణుబాబుగౌడ్, కంబాల మురళీకృష్ణ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

దండేపల్లి: ఇటీవల గోవాలో జరిగిన క్రికెట్ పోటీల్లో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పర్నంది రోహిత్ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించాడు. త్వరలో నేపాల్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు విద్యార్థిని హెచ్ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పుస్తెమెట్టెలు అందజేత

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన మెరుగు రాయలింగు, రమా కూతురు అఖిల వివాహానికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు గురువారం అందించారు. రాయలింగు కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుడు కావడంతో అతని కూతురు వివాహానికి పుస్తెమెట్టెలు అందించినట్లు అసిస్టెంట్ మేనేజర్ రమేశ్, సూపర్‌వైజర్ సాయికృష్ణ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా

మంచిర్యాలఅర్బన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పదవికి సన్నీగౌడ్ రాజీనామా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ నాటకపరిణామాల దృష్ట్యా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్‌లో తనతోపాటు పనిచేసిన పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చరణ్, సిద్దార్థ, కుతుబ్, గణేశ్, అరుణ్ సయ్యద్‌లు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

ఇటు ఎన్నికల కూత..అటు వరికోత

- ప్రచారంలో కూలీలు
- కొరతతో రైతులకు ఇబ్బంది



దేవులవాడలో కొనసాగుతున్న వరికోతలు

కోటపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వరికోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పలుచోట్ల పంట చేతికొచ్చింది. మరో పక్షం రోజులు దాటితే వరికోతలు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. దీంతో ప్రచార సమయంలో అభ్యర్థులకు కూలీలు దొరకని పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. లేకుంటే రాజకీయ పార్టీల నాయకులు ఎక్కువ డబ్బులు ఇచ్చి కూలీలను ప్రచారానికి తెప్పించుకుంటున్నారు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

పెరిగిన వరిసాగు

చెన్నూర్ నియోజకవర్గంలో గతంలో కంటే ఈసారి వరి పెద్దఎత్తున సాగు చేశారు. నీటి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపట్టడంతో ప్రస్తుతం పంటలు అన్ని చేతికొచ్చే దశకి చేరాయి. కాస్త ముందుసాగు చేసిన రైతులు కోతలు మొదలుపెట్టగా.. ఆలస్యంగా వేసిన వారు ఈనెలఖారు వరకు కోస్తారు. అదే సమయంలో ఎన్నికల వేడి పెరిగి ప్రచారం జోరందుకుంది. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలంతా ప్రచారానికి వెళ్లేందుకు మొగ్గుచూపతుండడంతో వీరి కొరత తీవ్రంగా ఏర్పడింది. ఈనెల 30న పోలింగ్ జరగనుంది. వీటన్నింటి నేపథ్యంలో రైతులు రాజకీయ పార్టీలు అత్యంత కీలక సమయం, రైతులు వ్యవసాయ కూలీలు ప్రచారం వైపు మొగ్గుచూపుతున్నారు.

పనులకు ఇబ్బందులు

ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు, బహిరంగ సభలు, సమావేశాల్లో డప్పువాయిద్యాలు, కోలాటాలు, ఇంకా అనేక కార్యక్రమాలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచే ప్రతిపార్టీ అభ్యర్థి తన బలాన్ని చూపడం కోసం జన సమీకరణపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. గ్రామాల్లోని కూలీలను సభ, సమావేశాలు, ర్యాలీలకు తీసుకెళ్తుండటంతో రైతుల వ్యవసాయం పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పత్తితీత పనులు జరుగుతున్నాయి. ఆ పనులు వెళ్లే కూలీలకు రోజుకూలీ రూ.300 చెల్లిస్తున్నారు. కొన్నిచోట్ల కిలోకు రూ.10 ఇస్తున్నారు. అంటే ఒక్కరు రోజంతా కష్టపడితే రూ.300 నుంచి రూ.400 వరకు సంపాదిస్తున్నారు. సభలు, సమావేశాలకు వెళ్తే పార్టీల నాయకులు రూ.200 ఇస్తామంటున్నారు. ఒప్పుకుని వారికి శీతలపానీయాలు ఇస్తామంటున్నారు. అయినా రాలేమంటే రూ.300 ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎండలో వ్యవసాయ పనులు చేసేందుకు కొందరు కూలీలు ఇష్టపడటంలేదు.



ఓటు చైతన్యం..!

మంచిర్యాలఅర్బన్: ఓటరును చైతన్యపర్చడమే లక్ష్యంగా మంచిర్యాల కేజీబీవీకి చెందిన బాలికలు అక్షరాల రూపేణా ప్రదర్శన ఆలోచింపజేస్తోంది. 195 మంది విద్యార్థినులు ఓటు, పోలింగ్ తేదీతో ఆకారంలో కూర్చుని అలరించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఉన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

బెల్లంపల్లి: కార్మిక ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మందమర్రి ఏరియా సింగరేణి విద్యుత్ విభాగం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఏబీటీ (బిల్లింగ్) మీటర్ల పరీక్ష కోసం 132 కేవీ మెయిన్ డొమెస్టిక్ పవర్‌షట్ డౌన్ కారణంగా మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లోని సింగరేణి కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు గమనించాలని కోరారు.

నిరుపయోగంగా ధర్మకాంట

- వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు లేకనే
- ప్రైవేట్ కాంటాల వద్దకు రైతులు
- మూతపడ్డ పెట్రోల్ పంప్



వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ధర్మకాంట

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2004లో రూ.15 లక్షలతో వెచ్చించి ఏర్పాటు చేసిన రెండు ధర్మకాంట నిరుపయోగంగా మారింది. పెద్ద ధర్మకాంట 40 టన్నులు, ఎడ్లబండి ధర్మకాంట 3 టన్నులు. కొన్నిరోజుల పనిచేసి ఆపై వినియోగం లేకపోవడంతో మూలనపడింది. రైతులు, వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన ధర్మకాంట ఉపయోగం లేకపోవడంతో పనికి రాకుండా పోయాయి. దాంతోపాటు యార్డులో ఉన్న పెట్రోల్‌పంప్ మూతపడింది. ఓ వైపు పంట కొనుగోళ్లు లేక, మరోవైపు పెట్రోల్ పంప్ మూతపడడంతో మార్కెట్ యార్డుకు ఆదాయం తగ్గింది.

యార్డులో కొనుగోళ్లు లేవు

దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేస్తున్నారు. పంటల కొనుగోళ్ల కోసం రైతులు, వ్యాపారులు లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వస్తే ఇక్కడ ధర్మకాంట పనికిరాకుండా పోయింది. పంట కొనుగోళ్ల కోసం చాలామంది ప్రైవేట్ ధర్మకాంటల వద్దకు వెళ్తున్నారు. యజమానులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు. ఇటీవల తూనికల శాఖాధికారులు ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఉన్న ధర్మకాంటను తనిఖీ చేశారు. తూకంలో తేడా ఉండడంతో రూ.5 వేల జరిమానా విధించారు.

మూసివేసిన పెట్రోల్ పంప్

కిసాన్ సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ మార్కెట్ యార్డులో పెట్రోల్ పంప్‌ను అధికారులు ఐవోసీ ఆధ్వర్యంలో 2012లో ప్రారంభించారు. దీని ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం, పట్టణవాసులకు అందుబాటులో పెట్రోల్, నిర్వాహకులకు జీవనోపాధిగా ఉండనుందని ప్రారంభించారు. తర్వాత మూసివేశారు.

కొనుగోలు లేకనే..

మార్కెట్‌యార్డులో కొనుగోలు లేకపోవడంతో ధర్మకాంట నిరుపయోగంగా మారాయి. కమిటీ తీర్మానం చేసి మరమ్మతు జరిపించాలి. మార్కెట్ సెక్రటరీ అందుబాటులో ఉండాలి. రైతులకు సేవలందించేలా చర్యలు తీసుకుంటాం.

– గజానంద్, వ్యవసాయ మార్కెట్ యార్డు జిల్లా అధికారి

'బీజేపీ అభ్యర్థికే మా మద్దతు'

చెన్నూర్: నియోజకవర్గంలో పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ కార్యక్రమాలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్‌కే మా మద్దతు ఇస్తున్నామని ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోదారి శ్రీకాంత్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏళ్లుగా చెన్నూర్ నియోజకవర్గంలో నేతకాని సామాజికవర్గాన్ని అన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయన్నారు. దుర్గం అశోక్ సేవ కార్యక్రమాలు గుర్తించిన జాతీయ పార్టీ బీజేపీ టికెట్ ఇచ్చిందన్నారు. అశోక్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి దుర్గం కత్తరశాల, నాయకులు సెగ్గం సందీప్, దుర్గం జనార్దన్, ఆకుదారి మల్లేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ ప్రసాద్, మహారాష్ట్ర ఎమ్మెల్యే అశోక్ గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ మేనిఫెస్టోను ఇంటింటా వివరిస్తూ ప్రచారం సాగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను నమ్మి మోసపోవద్దని ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు అవకాశం కల్పించాలని కోరారు.

మందమర్రిరూరల్: బీజేపీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ మద్దతుగా పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ నేతలు గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలు కమలం పువ్వు గుర్తుకే ఓటేయాలని కోరారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు దుర్గరాజ్, తిరుపతి, రమేశ్, కుమారస్వామి ఉన్నారు.



చెన్నూర్‌లో మాట్లాడుతున్న గోదారి శ్రీకాంత్



మందమర్రిలో ప్రచారం చేస్తున్న నాయకులు

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



పెంబిలో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

పెంబి: నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలు, తండాలకు రోడ్లు వేయించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు రాయదారి, అంకెన, కర్ణంలొద్ది, పోచంపల్లి, పుల్గంపాండ్రి, పెంబితండా, ఇటిక్యాల్, లోతర్యతండా, తాటిగూడ, మందపల్లి, నాగాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పుల్గంపాండ్రి గ్రామం నుంచి ఇప్పోడకు రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాన్సన్‌నాయక్ గెలవాలని పొర్లుదండాలు

ఖానాపూర్: ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్ గెలుపొందాలని పట్టణంలోని శివాజీనగర్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పొర్లుదండాలు పెట్టారు. కార్యక్రమంలో ద్యావతి రాజేశ్వర్, గుగ్గిల్ల రాజేందర్ గౌడ్, దాసరి రాజన్న, శంకర్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని ఐదో వార్డులో గంగపుత్ర, మాల సంఘం నాయకులతో, పదో వార్డులో తిమ్మాపూర్ పద్మశాలి సంఘం, శ్రీరాంనగర్‌లో ఖానాపూర్ గౌడ సంఘం నాయకులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీని సన్మానించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జన్నారం: నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజొద్దీన్ అన్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొనకల్‌లో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ, మండల అధ్యక్షుడు రాజరాంరెడ్డి ప్రచారం చేశారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. గురువారం మండలంలోని అంజీ, బోడిండగూడ, కొబ్బయ్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు.

వసుధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



ప్రారంభిస్తున్న మాతాజీ తేజోమయి

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వసుధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీమాత ఆశ్రమం హుబ్లీ అధ్యక్షురాలు మాతాజీ తేజోమయి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు అతి తక్కువ ఖర్చులో గుండెకు సంబంధించిన వ్యాధులకు చికిత్స అందించాలనే సంకల్పంతో వసుధ ఆసుపత్రిని నెలకొల్పామని తెలిపారు. జపాన్ టెక్నాలజీతో అత్యాధునిక పరికరాలు సమకూర్చి ప్రజలకు వైద్యసేవలందిస్తామన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజిస్ట్, యాంజియోప్లాస్టీ, గుండెనాళాల ఎండోస్కోపిక్ పరీక్ష, గుండె పంపింగ్‌ను మెరుగుపర్చే పరికరాలు, కరోనరీఆర్టరీలో స్టెనోసిస్ స్థితిని నిర్ధారించే విధానాలు, వ్యాధి నిర్ధారణ వంటి చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఉత్తర తెలంగాణలోనే మొదటిసారిగా మంచిర్యాల కేంద్రంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, ఆసుపత్రి యాజమాన్యం నరసింహులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై హామీ ఇవ్వాలి

శ్రీరాంపూర్: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిర్దిష్టమైన హామీలు ఇవ్వాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం సమావేశమై వారి సమస్యలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ మేనిఫెస్టోను ప్రకటించాయన్నారు. అందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు సమ్మయ్య, సంపత్, సురేశ్, సన్నీ, రమేశ్ పాల్గొన్నారు.

'మంచిర్యాలలో అలజడులకు కుట్ర'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల్లో అలజడులు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కుట్ర పన్నారని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని కాప్రాలో భూవివాదం కోర్టులో కొనసాగుతోందని, కోర్టులో ఓడిపోయిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులను మంచిర్యాలకు తీసుకవచ్చి ప్రజల్లో తప్పుడు సంకేతాలు తీసుకెళ్లాలని చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కుట్రలపై జిల్లా, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారులు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన వ్యక్తిగత న్యాయవాది ద్వారా కేంద్ర ఎన్నికల అధికారికి ప్రత్యేకంగా ఢిల్లీలో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. మంచిర్యాలలో శాంతిభద్రతలకు భంగం కలిగితే పూర్తి బాధ్యత దివాకర్‌రావు వహించాలని హెచ్చరించారు. చెన్నూరు, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థులు వివేక్, వినోద్‌ల ఇళ్లపై ఐటీ దాడులకు పాల్పడడం సరికాదని, రాజకీయ కక్షలతో తమ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక రెడ్డికాలనీ సత్యసాయి నిలయంలో గురువారం భగవాన్‌సత్యసాయిబాబా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అర్చనలు, ప్రవచనాలు, హారతి కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రిలోని సాయిబాబా ఆలయంలో సత్యసాయి బాబా పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆలయ సభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

'కేసీఆర్‌ది రాచరిక పాలన'



మాట్లాడుతున్న రాజురా ఎమ్మెల్యే సుభాష్‌దుబే

వేమనపల్లి: రాష్ట్రంలో కేసీఆర్ పాలన రాచరికాన్ని మించిపోయిందని మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాజురా ఎమ్మెల్యే సుభాష్‌దుబే అన్నారు. మండలంలోని నీల్వాయిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం బానిస తెలంగాణగా తయారు చేశారన్నారు. ఈ పాలనకు ప్రజలు ముగింపు పలికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. అనంతరం నీల్వాయికి చెందిన పురాణం కృష్ణ, దేవయ్య, నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. నీల్వాయి సర్పంచ్ గాలి మధు, మండల కోఆప్షన్ సభ్యుడు ముజ్జు, మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఒడ్డిళ్ల రాజన్న, చందు, మంత్రి రమేశ్, పురుషోత్తం, వినోద్‌రెడ్డి, తోకల రాంచందర్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

జైపూర్: మండలంలోని టీకుమట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో రామూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్లు అల్లాడి శ్రీనివాస్, నాందేవ్ మాట్లాడుతూ విద్యార్థుల ద్వారానే సమాజానికి మంచి ఆరోగ్య సమాచారాన్ని పంపగలమన్నారు. కీటకజనిత వ్యాధుల పట్ల జనాలు ఎలా రక్షించుకోవాలో చెప్పారు. దోమల రకాలు, వాటి ద్వారా వచ్చే మలేరియా, ఫైలేరియా, చికన్ గున్యా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధుల గురించి వివరించారు. పాఠశాల హెచ్ఎం ఉమారాణి, ఏఎన్ఎం పద్మ, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యంతరకర మెసేజ్‌లు పెడితే చర్యలు

బెల్లంపల్లి: సోషల్ మీడియా వేదికగా కించపరిచే మెసేజ్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ ఒకప్రకటనలో హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని రాజకీయ పార్టీని కాని ప్రజాప్రతినిధులు లేదా ఎవరైన సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు, కించపరిచే మెసేజ్‌లు పెట్టిన వ్యక్తులు, గ్రూప్ అడ్మిన్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలన్నారు.

చెన్నూర్‌లో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

చెన్నూర్: పట్టణంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ మోహన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, జైపూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి

మంచిర్యాలక్రైం: ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ (ఎన్‌జీవో) ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు అమ్ముకుంటే అధోగతి

చెన్నూర్: ఎన్నికల్లో ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతి పాలవుతుందని జైభారత్ నాయకుడు ఖాజామియా అన్నారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఓటరు చైతన్యం కల్పించేందుకు జైభారత్ ఆధ్వర్యంలో గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

మందమర్రిరూరల్: మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు కార్యాలయ సూపరింటెండెంట్ బాలకిషన్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

శభాష్..కౌన్సిలర్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని 5వ వార్డు మజీద్‌వాడలో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ గురువారం డ్రెయినేజీలో చెత్తను తొలగించారు. వాడల్లో డ్రెయినేజీలు పరిశీలిస్తుండగా చెత్త పేరుకపోయి ఉండడంతో స్వయంగా ఓ కర్రను తీసుకుని చెత్తను తొలగించి శభాష్ అనిపించుకున్నాడు.